# గణపతి నెడుతున్నా, బాబూ సెందాలివ్వండి!




## భమిడిపాటి భవానీశర్మ

"శ్రీదేవి" హోటల్ జంక్షన్ కళకళలాడుతోంది. పోయే కార్లు, వచ్చే బస్సులు, జనం హడావుడి, అన్నీ కలిసి ఆ ఊరు సగటు భారతావనికి ప్రతీకగా ఉందని ఋజువు చేస్తున్నాయి. భాద్రపద శుద్ధ పాడ్యమి, "విఘ్నేశ్వర చవితి" ఇంకా నాలుగు రోజులుందన్నమాట !

గణపతి అటూ ఇటూ హడావుడిగా తిరుగుతుంటే, ఎరిగినవాళ్ళు నవ్వుతున్నారు. ఎరగనివాళ్ళు వాడినో వింతపశువుని - చూసినట్టు చూస్తున్నారు. వాడు తమాషాగా "చందా డబ్బా"ని మ్రోగిస్తుంటే తోటివారు చోద్యంగా చూస్తున్నారు.

వాడలా కౌంటర్ ముందుకుపోయి, హోటల్ మేనేజరు శ్రీనివాసరావు వద్ద డబ్బా పెట్టాడు. 'ఏమిట'న్నట్టు చూశాడు శ్రీనివాసరావ్.

"సెందా బాబూ, ఇనాయకుణ్ణెట్టటానికి." బదులిచ్చాడు గణపతి.

"ఇంకా నాలుగు రోజులుందికదరా, ఎందుకు గాభరా ?" చికాకుగా అన్నాడు శ్రీనివాసరావు.

"లేదుబాబూ, ఇనాయకుణ్ణి చేపించడానికి ఎడ్వాన్సివ్వాలి, , రంగు కాగితాలు కొనాల, సున్నం కొనాల. ఇంకా..." చెప్పబోతున్న గణపతిని మధ్యలోనే ఆపి, నవ్వుతూ,

"ఊఁ దండకం వల్లించావులే(గా)ని, ఇంద అఘోరించు" అంటూ రూపాయి నోటు డబ్బీలో వేశాడు.

ఆనందంగా గెంతుతూ వెళ్ళిపోయాడు గణపతి.

* * *

సాయంకాలం మూడుంపావు అవ్వొస్తోంది. చవితికి ముందు 'సిరివాన' కురుస్తుందని పెద్దలంటారు. అదెంత నిజమో తెలియదుగాని, ఆ రోజు మాత్రం రెండుగంటల నుంచీ 'అటు జల్లూకాదు, ఇటు కుంభవృష్టీకాదు' అన్నట్టు వాన కురుస్తోంది సుభద్ర ఆ వానలో తడుస్తూనే హడావుడిగా తిరుగుతోంది. కొడుకు రామ్మూర్తి తెలుగువాచకాన్ని వల్లె వేస్తున్నాడు. భర్త అవధాన్లు వీధి వసారాలో, హాయిగా కూర్చున్నారు మఠం వేసికొని.


జల్లు కొంచెం తెరిపినిచ్చింది. "శంకరం గామోసు" ముసుగువేసికొని వెళుతున్న యువకుణ్ణి చూసి అనుకున్నారు అవధాన్లు. "ఒరే ! శంకరం. ఇటురా ఓమారు" అంటూ కేకవేశారు.

శంకరం వెనుదిరిగాడు. మనసులో విసుక్కుంటూనే "ఏం ? బాబాయ్‌గారూ !" అంటూ పలకరించాడు

"ఏంలేదురా ! మొన్న రావుడికి వచ్చినంత చేసింది, ఎరుగుదువుకదా !" అని తన సహజ ధోరణిలో ప్రారంభించారు అవధాన్లు. ఆయనలోని ప్రత్యేకత అదే ! ఎదుటివాడు ఎలాంటివాడయినా సరే, ఆయన వాగ్ధాటికి "మంత్రబద్ధ సర్పం" అవక తప్పదుమరి !

"అవునట ! నేను జలుమూరు వెళ్ళాను, మా పిన్నిని చూడటానికి. అందుకని నాకు వివరాలు తెలియలేదు. ఇంతకీ జబ్బేమిటి ?" అప్రయత్నంగానే కూర్చొని అడిగాడు శంకరం.

"అబ్బే ! జబ్బేమీ లేదురా, వాడేమో 'నాన్నా బాలగణపతిని దించుతాను డబ్బులియ్యి' అన్నాడు. నేనసలే కాస్త దుడుకువాణ్ణి గదా ! 'వెధవా ! వేలెడంతలేవు నీకు వేషాలేమిటి, తిన్నగా పడుండు,' అని కసిరేశాను. సరి ! ఆ రాత్రే, ఒక్కసారి, నూట అయిదుకి పెరిగిపోయింది ఉష్ణం. సరి, పలవరింతలు ! అబ్బబ్బ, తినేశాడ రాత్రంతా. అప్పుడు మ్రొక్కుకున్నాను 'వినాయకుణ్ణి దించుతాను, అపరాధాన్ని మన్నించుమ'ని. అందుకు మన వీధిలో ఎక్కడ బావుంటుందో ఏర్పాటు చెయ్యి" అని చెప్పారు అవధాన్లు.




Imageads-M-AL-1424 Tel

కొంతసేపు దీర్ఘంగా ఆలోచించినపిమ్మట శంకరం స్వరం విప్పి, "బాబాయ్‌గారూ! ఓ పని చేయవాదూ?" అన్నాడు

'ఏమిటిరా, అది?" అన్నారు అవధాన్లుగారు

చెప్పాడు శంకరం

"భేష్! బాగుంది" అంటూ మెచ్చుకోలుగా శంకరాన్ని చూశారు అవధాన్లుగారు

*　　*　　*

"ఏదీ, పదింపావలా, పదిన్నర, ఏదీ అరవై, పదిహేనూ అరవై" అంటూ ఆగి, "అమ్మా! ఇయ్యాల దాసుగారు అయిదు రూపాయలేశారే!" అంటూ, గొప్పగా చెప్పాడు గణపతి

పెంటమ్మ ఆశ్చర్యపోయూ, "ఎవుర్రా, మెచ్చరుబాబే! నిజమ్మరా?" అని అడిగింది

"ఆఁ నురేటనుకున్నావ్?" అంటూ లెక్క వేయటంలో మునిగిపోయాడు గణపతి

అసలు గణపతికి ఐదవ ఏటినుంచీ చదువూ, భక్తీ రెండూ సమపాళ్ళలో కుదిరాయి అందుకనే వాడంటే టీచర్లకు అభిమానం పెంటమ్మ కూడా పెనిమిటి పోయిన దగ్గరినుండీ, కొడుకే సర్వస్వంగా బ్రతుకుతోంది

వాడు ఏటా, శ్రీరాములునాయుడు వాకిట అగ్రహారంలో — దేవుణ్ణిదించుతాడు ప్రోగయిన చందానుబట్టి విగ్రహాన్ని కొని యధావిధిగా అవధాన్లుగారిచేత పూజ చేయిస్తాడు పనిమనిషి కొడుకుగా, గణపతిగాడి 'వినాయకుడి పూజ' డబ్బులు తీసుకోకుండా చేస్తూండటం రివాజు

పెంటమ్మ వంట పూర్తయింది

గణపతి ఆకు వేసుకొని, నీళ్ళు పెట్టుకొని, కొద్దిగా నీరు త్రాగి భోజనం ప్రారంభించాడు

మజ్జిగ వేసుకొంటుంటే, పోలయ్య వచ్చి, "గణపతీ! బాబు నిన్ను పిలుస్తున్నాడు బేగిరా," అంటూ వెళ్ళిపోయాడు

"ఆహాఁ' అంటూ గబగబా తినేసి, చెయ్యి కడుక్కొని, 'అమ్మా! బాబుగారి దగ్గిఱ కెల్తున్నాను," అని పరుగుదీశాడు గణపతి

*　　*　　*

"ఇదిరా! గణపతీ, వరిప్పుడు రామ్మూర్తికి మొక్కు తీర్చాలికదరా! అందుకని వేరేగా ఎందుకు పెట్టటమని, నీ వసారాలోనే పెట్టేస్తాము నువ్వు ఎక్కడికైనా వెళ్ళిపోతే వెళ్ళిపో, లేదూ అంటే అక్కడే నువ్వో ఘడియ కూర్చో!" అని చెప్పేశారు అవధాన్లుగారు

ఇంచుమించుగా ఏడుపు మొహంతో ఇల్లు చేరాడు గణపతి

*　　*　　*

బజార్లో పిచ్చిగా తిరుగుతున్నాడు గణపతి

శ్రీనివాసరావు ఎదురుపడి, 'ఏరా! గణపతీ, అవధాన్లు దించుతున్నాడంటగదా వినాయకుణ్ణి, నిజమేనా?" అని అడిగాడు

అవునన్నట్లు తల పంకించాడు, గణపతి ముందుకు వెళ్తూ

"ఛాన్సు కొట్టావులే, చందా డబ్బులుపెట్టి ఏదైనా కొనుక్కో" అన్న శ్రీనివాసరావు గొంతు వినపడనే వినపడింది గణపతికి ఉక్రోషం ముంచుకొచ్చింది వాడికి

"ఏదయితేనేం, గణపతికి నేను సేవచేయక తప్పదు" అని గట్టిగా నిర్ణయించుకొన్నాడు గణపతి

*　　*　　*

తదియ సాయంకాలం —

"దేహినోస్మిన్ యధాదేహే, కౌమారం
యౌవనం జరాః
తధా దేహాంతర ప్రాప్తిర్ధీర స్తత్ర
సముహ్యతి"

అన్నట్లుగ్గా వృద్ధాప్యపు ఛాయలను విడిచి దేహాంతరం ప్రాప్తుడవటానికిగాను, భాస్కరుడు బయలుదేరుతున్నాడు

అదే సమయంలో గణపతి బజార్లో హడావుడిగా తిరుగుతున్నాడు సంచిలో సున్నపురాళ్ళు, పత్రి మొదలయినవి ఇమిడ్చి, ఊదుబత్తి, కర్పూరం తీసుకొన్నాడు ఇంటికి వచ్చి, రాళ్ళు ఉడకవేశాడు

గాభరాగా తిరిగి నాలుగు మామిడికొమ్మలు తెచ్చాడు

అవధాన్లుగారింటికెళ్ళాడు

ఆయన మాంచి గాభరాలో నున్నారు

ఒకవైపు సున్నం వాళ్ళని పురమాయిస్తూ, మామిడికొమ్మల తోరణాలు కట్టిస్తూ, కట్టించిన

ఆంధ్రపత్రిక
దినపత్రికలో
"మహిళావాణి"
చూశారా?
దానిలో పాల్గొనండి!
దానిని చదవండి!!

వాటిని నాయుడుగారింటికి తరలిస్తూ, బ్యాండు వాళ్ళతో బేరమాడుతూ, ఇలా విశ్వరూపం చూపుతున్నారు

ఆ సమయంలో గణపతి వెళ్ళి, "బాబుగారూ, రేపు పూజ ఎన్నింటిలోపల చెయ్యాలి" అని అడిగాడు

ఆయన వినిపించుకోలేదు

రెండోసారి మూడోసారి ఇలా ఐదుసార్లు అడిగాడు

ఆయన తన పనిలో మునిగిపోయి ఉన్నాడు

ఇలాగ కాదనిచెప్పి, తాను తాకితే కోపం వస్తుందన్న సంగతి మరచి, అవధాన్లుగారి చెయ్యి పట్టుకొని అడిగాడు "ఏమండీ! పూజ ఎంతకు చేయాలి?" అని

అంతే! అవధాన్లుగారు రెచ్చిపోయి, తోక తొక్కిన త్రాచులా ఎడాపెడా గణపతిని తిట్టి, చెంపలు వాయించేశారు ఇంతలో శంకరం విడిపించి, గణపతిని బైటకు తీసుకెళ్ళి, "ఏమిటిరా, నీక్కావాలి?" అని ప్రశ్నించాడు

"రేపు పూజ ఎంతకు చేయాలి బాబూ?" గణపతి మరలా అదే విషయం అడిగాడు

"రేపా? తొమ్మిదింబావు లోపల' అన్నాడు శంకరం

"ఆహాఁ" అంటూ వెళ్ళిపోయాడు గణపతి

"పిచ్చి వెధవ!" అనుకుంటూ తిరిగి పన్లో పడ్డాడు శంకరం

శ్రీరాములునాయుడి ఇంటికి మూడిళ్ళ అవతల పెంటమ్మ ఇల్లు నాయుడి వసారా చూసుకుంటూ నడుస్తున్నాడు గణపతి అక్కడ తన నేస్తాలందరూ రామ్మూర్తితో కలిసి — రంగు కాగితాలు అంటిస్తున్నారు గుమ్మటానికి

'ఇందుకా వీళ్ళు తనతో కలియమని చెప్పింది స్వగతంలో అనుకొన్నాడు గణపతి

*　　*　　*

చవితినాడు 'సంరంభాలన్నీ బ్రహ్మాండంగ ఉన్నాయని' ఒకరూ, 'మొక్కు అయితేనేం చక్కగ చేశాడు అవధాన్లు' అని ఒకరూ ఇలా వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి

గణపతి దేవుడికి పూజ చేద్దామంటే పంతులు దొరకలేదు ఆ కాస్త చందా సొమ్ము గుమ్మటం కొనటానికీ, సున్నానికే సరిపోయింది మరి రంగు కాగితాలులేవు 'అవధాన్లుగారంటే డబ్బులు పుచ్చుకోకుండా పూజ చేస్తారుగానీ, మరెవరూ చేయరు' అనుకొని ఏమీ చేయలేక ఇన్ని పువ్వులు పత్రి జల్లేసి, కర్పూరం, ఊదొత్తులూ వెలిగించి — తనకొచ్చిన "శుక్లాంబరధరం" శ్లోకం చదివేశాడు

ఆ సాయంత్రం అందరూ అవధాన్లుగారి గణపతి దగ్గఱకు వెళ్ళి చూసి వస్తున్నారు పాపం గణపతిగాడి దేవుడిని చూడటానికి ఒక్కరూ రావటం లేదు పైగా "పూజలేని దేవుడిని చూడటం మహాపాపం" అని అనుకుంటూ వెళ్ళిపోసాగారు పాపం! గణపతి చాలా బాధపడ్డాడు

*　　*　　*

సరే! అనిచెప్పి, బయలుదేరి నాయుడిగారి వసారాలో అడుగుపెట్టి చూశాడు రాత్రి సుమారు తొమ్మిది గంటలు కుంకుమ పెట్టుకోబోతూ ఎందుకో కిటికీలోంచి చూశాడు అంతే! గుండెలాగి పోయాయి గణపతికి

అక్కడ చందా డిబ్బీలో డబ్బులు తీసి, జేబులో వేసుకొంటున్నారు అవధాన్లుగారు నాయుడుగారి ఇనప్పెట్టెగూడా సగం నిండింది ఔనుమరి ఊరంతా వస్తున్నారు, వెళుతున్నారు అయితే మొక్కేమీ లేదన్నమాట

అయితే, 'ఇందుకా! నన్ను ఇక్కడ వినాయకుణ్ణి దించవద్దంది' అనుకుని, గణపతి తల్లివద్దకు పరుగెత్తి తాను చూసింది చెప్పాడు

"ఆఁ!" అంటూ నోరు వెళ్ళబెట్టింది పెంటమ్మ

*　　*　　*

మర్నాడుదయం పెంటమ్మ లేచేసరికి, గణపతి మంచంమీద లేడు "ఇదేమిటి చెప్మా," అనుకుని బయటకువచ్చి చూసేసరికి గుమ్మటంలేదు వినాయక విగ్రహం లేదు ఇంతలో గణపతి వచ్చాడు "అమ్మా! విగ్రహాన్ని అనిపేశాను" అని నిర్లిప్తంగా అంటూ

అయోమయంగా చూస్తున్నది పెంటమ్మ

"మరెప్పుడూ వినాయకుణ్ణి దించను" అనుకొన్నాడు గణపతి ●